గుమ్మడిదలలో నీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

గుమ్మడిదల, జూన్ 13: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గుమ్మడిదలలో హానర్ ల్యాబ్స్ సౌజన్యంతో రూ.20 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులకు గురువారం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కోహీర్, జూన్ 13: ఎరువులు, విత్తనాలు, మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోనీ హెచ్చరించారు. గురువారం కోహీర్ పట్టణంలోని రైతు సేవా కేంద్రంతో పాటు పలు ఫర్టిలైజర్ దుకాణాలు, కవేలి, దిగ్వాల్‌లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, మందుల ధరలు నోటీస్‌బోర్డుపై అందుబాటులో ఉంచాలన్నారు. విక్రయాలు మొత్తం ఈపీఓస్ యంత్రం ద్వారానే కొనసాగించాలన్నారు. అధిక ధరలకు అమ్మినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్ ప్రసాద్, శ్రీకాంత్ రాహుల్, నవీన్‌కుమార్, ఫర్టిలైజర్ డీలర్లు ఉన్నారు.

కోహీర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోనీ

నాణ్యమైన విద్యను అందించాలి

బొల్లారం, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించినప్పుడే విద్యార్థుల తల్లిదండ్రులకు సర్కారు విద్యపై నమ్మకం కలుగుతుందని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని అర్బన్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ లావణ్యానరేశ్, ఉపాధ్యాయులు

జిన్నారం, జూన్ 13: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని ఎంపీటీసీ లావణ్యానరేశ్ అన్నారు. జిన్నారం లోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, శంకరయ్య, కోటేశ్‌గౌడ్, పల్నాటి భాస్కర్, ప్రదీప్‌గౌడ్, ప్రవీణ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెత్త తరలింపు

- నక్కవాగును పరిశీలించిన ఎంపీడీవో యాదగిరి
- 'నమస్తే తెలంగాణ' కథనంతో చర్యలు ముమ్మరం
- వాగును శుభ్రం చేయాలని డీపీవో ఆదేశాలు

చిట్కుల్ గ్రామంలో నక్కవాగును పరిశీలిస్తున్న పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి

పటాన్‌చెరు, జూన్ 13: నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 10న వచ్చిన 'నక్కవాగులో చెత్త డంపింగ్' అనే కథనంపై అధికారులు స్పందించి చర్యలు పూనుకున్నారు. ఎంపీడీవో ఆదేశాలతో చెత్తను తొలిగించే పనులు చురుకుగా సాగుతున్నాయి. భారీ ఎత్తున నక్కవాగులో చిట్కుల్ పంచాయతీ చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేస్తున్నారని వచ్చిన కథనంపై కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు డీపీవో చర్యలకు ప్రతిపాదించారు. ఎంపీడీవో, ఎంపీవోలు జిల్లా అధికారుల ఆదేశాల అమలుకు కార్యదర్శి కవితకు సూచనలు చేశారు. జేసీబీతో నక్కవాగులో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది తొలిగిస్తున్నారు. గురువారం ఎంపీడీవో యాదగిరి పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పంచాయతీకి వచ్చారు. కార్యదర్శి కవితతో కలిసి నక్కవాగును పరిశీలించారు. వాగులో ఎలాంటి చెత్తను వేయవద్దని జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చారని హెచ్చరించారు. మహేశ్వర కళాశాల వద్ద ఉన్న ఖాళీ జాగలో డంప్‌యార్డును నిర్మించి జీహెచ్ఎంసీ, స్వచ్ఛ భారత్ సంస్థ ద్వారా చెత్తను పునర్వినియోగించేలా చూడాలని ఎంపీడీవో కార్యదర్శికి ఆదేశించారు. కాలనీలు పెరిగిపోవడంతో చెత్త సమస్య రెట్టింపు అయ్యిందని కార్యదర్శి తెలిపారు. చెత్త పెద్ద సమస్యగా మారిందని కవిత ఎంపీడీవో దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే పటాన్‌చెరు మండలంలోని రుద్రారం, ముత్తంగి, చిట్కుల్, ఇంద్రేశం పంచాయతీల్లో చెత్తను రీసైక్లింగ్ చేసే యూనిట్లు పెట్టేందుకు ప్రణాళిక వేశామన్నారు. చెత్త వాడకంపై త్వరలోనే రాష్ట్ర బృందం తనిఖీకి రానున్నదని ఎంపీడీవో వివరించారు. మండలంలో ఉత్పత్తి అవుతున్న చెత్తకు పరిష్కారం చూపిస్తామన్నారు. శరవేగంగా పెరుగుతున్న కాలనీల్లో చెత్తపై అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిడ్డలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- తల్లీకూతురు క్షేమం.. కొడుకు మృతి
- అమీన్‌పూర్ పెద్ద చెరువులో ఘటన

శ్రీహాన్స్ మృతదేహం

అమీన్‌పూర్, జూన్ 13: భార్యాభర్తల మధ్య తరుచూ నెలకొంటున్న గొడవలతో విరక్తి చెందిన భార్య తన ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో తల్లీకూతురు ప్రాణాలతో బయటపడగా మూడేండ్ల కొడుకు ప్రాణాలు కోల్పోయాడు. అమీన్‌పూర్ పెద్ద చెరువులో ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌కు చెందిన శ్వేత, విద్యాధర్ రెడ్డి భార్యభర్తలు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. వీరికి మూడేళ్ల వయసు గల కవలలు పాప శ్రీహా, బాబు శ్రీహాన్స్ ఉన్నారు. దంపతుల మధ్య తరుచూ గొడవలు జరగడంతో ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి శ్వేత బుధవారం అర్ధరాత్రి స్కూటీపై అమీన్‌పూర్ పెద్ద చెరువుకు వచ్చింది. తన పిల్లలతో కలిసి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పెట్రోలింగ్ చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ జానకీరామ్, కానిస్టేబుల్ ప్రభాకర్ గుర్తించి తల్లి, పాపను ప్రాణాలతో బయటకు తీశారు. చెరువులో మునిగిపోయిన బాబు శ్రీహాన్స్ కోసం గాలించగా గురువారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు సర్కారు దవాఖానకు తరలించారు . ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు చిత్రపటం బహూకరణ

సీఎంకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న కళాకారుడు, పక్కన ఎంపీ షెట్కార్

సిర్గాపూర్, జూన్ 13: మండలంలోని కడ్పల్ గ్రామానికి చెందిన సోదరులు మూగ, చెవిటి కళాకారులు గూడురు నాగరాజు, ఆగమప్ప చేతితో గీసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని గురువారం సీఎం రేవంత్‌రెడ్డికి స్వయంగా అందజేశారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వెళ్లిన కళాకారులు సీఎంకు చిత్రపటాన్ని బహూకరించారు. వీరి ఆర్ట్ పట్ల సీఎం హర్షం వ్యక్తం చేసి అభినందించారు. పేదలైన వీరిని ప్రభుత్వం ఆదుకొని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఎంపీ సురేశ్‌షెట్కార్ సీఎంను కోరారు.

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 13: విద్యుత్ సమస్యలను పరిష్కరించే నిమిత్తం గురువారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అంతరాయం లేకుండా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరయ్యేలా చూస్తానన్నారు. సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు.

చాప్టా(కె)లో పత్తి సాగును పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్

క్షేత్రస్థాయిలో పత్తి సాగు పరిశీలన

నారాయణఖేడ్, జూన్ 13: నారాయణఖేడ్ వ్యవసాయశాఖ ఏడీఏ నూతన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి శంకర్ గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నారాయణఖేడ్ మండలం చాప్టా(కె)లో పత్తి సాగు పద్ధతులను పరిశీలించడంతో పాటు రైతులకు పలు సూచనలు చేశారు. బీజీ 2 పత్తి విత్తనాలు మాత్రమే ఇక్కడి భూములకు అనుకూలంగా ఉంటాయని, భూమిలో అనువైన పదను ఉంటేనే విత్తనాలు వేసుకోవాలన్నారు. పత్తి విత్తనాలు వేసిన 48 గంటల్లో కలుపు నివారణ మందును పిచికారీ చేయాలన్నారు. ఎప్పటికప్పుడు తమ సూచనలను పాటించడం ద్వారా అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నారాయణఖేడ్, జూన్ 13: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్తాపూర్‌కు చెందిన సుంగూర్ పోచయ్య(45) గురువారం నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ శివారులో మామిడిచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య కొంతకాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నాడని విచారణలో తేలిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే అనుచరుల దౌర్జన్యం!

దాడికి గురైన బాధితులు

పటాన్ చెరు, జూన్ 13: మండలంలోని ముత్తంగి గ్రామానికి చెందిన గడీల శ్రీనివాస్ గౌడ్, గడీల శ్రీధర్ గౌడ్, గడీల సాయి కృపా గౌడ్‌కు సంబంధించి సర్వే నంబర్ 454లోని భూమిలో కొందరు నర్సరీ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. వారిపై బుధవారం అర్ధరాత్రి మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కొడుకు ఆశీష్‌గౌడ్ అనుచరులు దాడికి పాల్పడ్డారు. చంపేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేశారని బాధితులు వాపోయారు. ఈ విషయంపై తమకు ప్రాణహాని ఉన్నదని, రక్షణ కల్పించాలని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్మికులకు వైద్యసేవలు అందించాలి

కార్మికులకు వైద్యసేవలు అందించాలని కోరుతున్న సీఐటీయూ నాయకులు

కోహీర్, జూన్13: జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు వైద్య సేవలు అందించాలని సీఐటీయూ నాయకులు అధికారులను కోరారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు చివరిసారిగా వైద్య సేవలు అందించి రెండు నెలల పది రోజులు అవుతున్నదన్నారు. అప్పటినుంచి కేంద్రం మూతపడి ఉందన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వెంటనే కార్మికులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్, కార్మికులున్నారు.

చినుకు పడితే చిత్తడే..

బురదమయంగా కంది తహసీల్ కార్యాలయ రోడ్డు

కంది, జూన్ 13: కురుస్తున్న వర్షాలతో గ్రామాల రోడ్లు చిత్తడిగా మారడంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా మట్టిరోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. మండల కేంద్రమైన కంది లోని తహసీల్ కార్యాలయ ఆవరణలో మురికి నీరు నిలవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయం ఒకే చోట ఉండటంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం, ఇతర పనుల నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. నడకదారిలో వచ్చేవారు ఈ మురికి నీటిని దాటుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. అధికారులు సమస్యను గుర్తించి తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సదరం సర్టిఫికెట్ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శివశంకర్‌రావు

దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందజేత

హత్నూర, జూన్ 13: దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరుచేసిన సదరం సర్టిఫికెట్లను బీఆర్ఎస్ నాయకుడు శివశంకర్‌రావు గురువారం అందజేశారు. హత్నూర మండలంలోని పలుగ్రామాలకు చెందిన పలువురు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా ఎనిమిది మందికి ప్రభుత్వం సర్టిఫికెట్లు మంజూరు చేయడంతో వాటిని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, నగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

అధిక ఫీజులతో తల్లిదండ్రులపై భారం

బొల్లారం, జూన్ 13: ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తున్నారని, చిన్నచిన్న తరగతులకే లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నేత రాజయ్య గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను విద్యాసంస్థలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల పిల్లలకు 25 శాతం ఉచితంగా సీట్లు ఇవ్వాలన్నారు. జర్నలిస్టు పిల్లలకు కూడా ఉచిత విద్యను అందించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో యూనిఫామ్, స్టేషనరీ, బుక్స్, పాఠ్యపుస్తకాలు అమ్మకూడదని సర్క్యులర్ ఉన్నా ఇష్టానుసారంగా అమ్ముతున్నారని ఆరోపించారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా

సంగారెడ్డి, కలెక్టరేట్, జూన్ 13: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆశాలకు పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఆశాలపై అధికారుల వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణికి అందజేశారు. అంతకుముందు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక కేవల్ కిషన్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాలపై కక్ష గట్టి పరీక్ష విధానాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. పరీక్షకు వెళ్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాదగిరి, మహిపాల్, విద్యాసాగర్, ప్రవీణ్, వరలక్ష్మి, వీరమణి, విజయ, గంగమణి, మంగ, సునీత, రజిత, విజయ పాల్గొన్నారు.

పోలీసులకు బైక్ దొంగల అప్పగింత

నిందితులను పోలీసులకు అప్పగించిన స్థానికులు

బొల్లారం, జూన్ 13: మున్సిపాలిటీ పరిధిలో నెల రోజులుగా వరుస బైక్ చోరీలు కలకలం రేపుతున్నాయి. బుధవారం రాత్రి పోచమ్మ బస్తీలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను స్థానికులు నిర్బంధించి పోలీసులకు అప్పగించారు. దొంగిలించిన బైకుల నుంచి విడిభాగాలను అమ్ముకుంటూ ఈజీ మనీకి అలవాటు పడ్డారని స్థానికులు చెబుతున్నారు. దొంగత నాలకు పాల్పడుతున్న ముగ్గురు నారాయణ ఖేడ్, ఫిలింనగర్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. ఇప్పటికే రెండు బైకులు చోరీకి గురయ్యాయని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టుబడిన దొంగలను చితకబాది పోలీసులకు అప్పగించారు. ఎస్సై దశరథ్ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేశ్

న్యాల్‌కల్, జూన్ 13: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి సురేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన న్యాల్‌కల్ ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, అతిసారం, విష జ్వరాలు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ముందుజాగ్రత్త చర్యగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిచ్చి మొక్కలుంటే తొలిగించుకోవాలన్నారు. గ్రామాల్లో మురికి కాల్వలను శుభ్రం చేయడమే కాకుండా తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలుంటే మరమ్మతులు చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి

విద్యా సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు

పుల్కల్, జూన్ 13: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే విద్యా సదస్సుకు జిల్లాలోని ఉపాధ్యాయులు హాజరుకావాలని రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో గురువారం విద్యా సదస్సు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగం సంక్షోభంలో కర్తవ్యాలు, సంక్షోభంలో సామాజిక విలువలు అనే అంశాల మీద విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ టీపీటీఎఫ్ హక్కుల కోసం పోరాడుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ అభివృద్ధి, సామాజిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గాజుల సుభాష్, పుల్కల్ మండల అధ్యక్షుడు మన్నె జయకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి బైండ్ల రామకృష్ణ, చౌటకూర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఆనందం, శశిధర్, జొన్నాడ మల్లేశం, చంద్రమోహన్, మహమ్మద్ ఫరూక్, పైతర రాములు, వీరేశం, వరాల గోపికృష్ణ, నాగరాణి, శ్రీదేవి, దేవేందర్, పెద్దారెడ్డిపేట పాఠశాల ఉపాధ్యాయులు విఠల్, రాజు, సుగుణ, రఘునందన్ రెడ్డి, సునంద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

హత్నూర, జూన్ 13: కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదం జరిగినప్పుడే స్పందిస్తారా అని మండల పరిధిలోని కాసాల 12వ వార్డు ప్రజలు, సమీప పాఠశాల సిబ్బంది విద్యుత్ అధికారులతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాసాల 12వ వార్డులోని విజ్ఞాన్ పాఠశాల సమీపంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. స్కూల్ బస్సులు వెళ్లే సమయంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠశాల యాజమాన్యంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు సరిచేయాలని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బస్సుకు తగిలేలా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

నేడు విద్యుత్ కార్యాలయంలో గ్రీవెన్స్

రామచంద్రాపురం, జూన్ 13: విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఆర్సీపురం డివిజన్‌లోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం గ్రీవెన్స్ డేను నిర్వహిస్తామని ఏఈ సంజీవ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు రసీదు తీసుకొని రావాలని సూచించారు. విద్యుత్ సరఫరాల్లో తరుచూ వచ్చే అంతరాయాలు, విద్యుత్ హెచ్చుతగ్గులు, విద్యుత్ మీటర్ల సమస్యలు, విద్యుత్ బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసులు, యాజమాన్య బదిలీ, సర్వీసులో మార్పు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, విద్యుత్ సరఫరాలకు సంబంధించిన ఇతర సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌డేని వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గ్రీవెన్స్ ఉంటుందని పేర్కొన్నారు.

నేడు తైబజార్ వేలం

సిర్గాపూర్, జూన్ 13: మండల కేంద్రమైన సిర్గాపూర్ పంచాయతీలో శుక్రవారం తైబజార్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పంచాయతీ వద్ద వేలం ప్రారంభమవుతుందన్నారు. వేలంపాట పాడే వ్యక్తులు ముందుస్తుగా రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. పంచాయతీకి బకాయి ఉన్న వ్యక్తులు వేలం పాటలో పాల్గొనేందుకు అనర్హులని, పంచాయతీ నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

మినీ గురుకులంలో ప్రవేశాలు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: జిల్లాలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు సంబంధించి కల్హేర్ మండలం బాచుపల్లిలో 1వ తరగతిలో 30 సీట్లు, 5వ తరగతిలో 22 ఖాళీల భర్తీకి గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు గిరిజన గురుకుల ఆర్‌సీవో కల్యాణి గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత పాఠశాలలో ఈ నెల 18న సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు పాఠశాలలో విద్యార్థుల ఎంపిక లాటరీ పద్ధతిలో ఉంటుందని పేర్కొన్నారు. అయితే సొంత మండల విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఎంపికైన విద్యార్థుల జాబితాను నోటీస్‌బోర్డులో అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

20 నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 13: డిగ్రీ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 20 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలతోపాటు మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలు నిర